

కథ

# అన్వేష



ఎమ్. సాయిలక్ష్మి జోగేశ్వరి

**ఒకరి నొకరు తొక్కుకుంటూ, తోసుకుంటూ బస్సెక్కిన జనం పూర్తిగా సర్దుకోకముందే బస్సు రయ్యిన స్పీడందుకుంది.**

భుజంమీంచి జారిపోతున్న హేండ్ బాగ్‌ను సర్దుకుంటూ టికెట్టుకోసం చిల్లరడబ్బులు తీస్తున్నాను. 'ఏమండీ....బాగున్నారా' అంటూ పలకరింపు వినబడింది. కిటికీ పక్కనే కూర్చున్న నడివయస్సు స్త్రీ పలకరిస్తోంది.

బాగానే ఉన్నానని చెప్పి, టికెట్టు తీసుకుంటున్నాను. ఇంతకీ ఆ పలకరించి నావిడ ఎవరో ఎంత ఆలోచించినా గుర్తు రాలేదు. పనిగట్టుకుని పలకరించిందంటే, ఎక్కడో తెలిసి నావిడే అయుంటుంది. నే నసలే మతిమరుపు మేళాన్ని. ఈవిడ ఏ దూరపు బంధువో, బస్సులోనో, బస్టాపులోనో, పెళ్లిలోనో....ఎక్కడ పరిచయమో గుర్తురాలేదు. టికెట్టు, చిల్లర బాగులో పెట్టుకుని తలెత్తి చూసేసరికి ఆవిడ నా మొహంవంకే తేరిపార చూస్తోంది. తప్పదన్నట్లుగా చిన్నగా నవ్వాను.

"మీరు ఈ ఊళ్లోనే పని చేస్తున్నారా?" అనడిగింది.

అంతగా ట్రాన్స్‌ఫర్లు కాని ఉద్యోగం నాది. అందుకే ఏళ్ల తరబడి ఒకే ఊళ్లో ఉద్యోగం చేస్తున్నాను. ఆ మాటే చెప్పాను ఆవిడతో.

"మీ తమ్ముళ్ల పెళ్లిళ్లు అయిపోయాయా!" అడిగింది ఆవిడ.

"తమ్ముళ్లు కాదండి...ఇద్దరూ అన్నయ్యలే. పెళ్లిళ్లు అయిపోయాయి." మనసులో కాస్త చిరాగ్గా అనిపిస్తోంది.

ఎండుమిర్చి ఘాటు, చేపల కంపు, వీటికితోడు బస్సులో కిక్కిరిసిన జనాల చెమటకంపు....అన్నీ కలగాపులగంగా అలుముకుని వాంతి వచ్చేటట్టు ఉంది. గ్రామీణులు తాము తెచ్చిన సరుకులన్నీ సంతలో చెల్లగొట్టి, తమకు కావలసిన వస్తువులు సంతలో కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. పల్లెటూరి రూట్లలో సంతరోజుల్లో ఇలాంటి దుర్వాసనలు భరించక తప్పదు.

మళ్లీ ఆవిడ ప్రశ్నల పరంపర మొదలైంది. "మీ ఆయనేం చేస్తారు?" చెప్పాను.

"అలాగా...మరి ఇంట్లో పిల్ల ల్నెవరు చూస్తారు?"

"ఆ సమస్యే లేదు...పిల్లలంటూ ఉంటేగా!" మామూలుగా చెప్పాను.

నే నేదో మహానేరం చేసినట్లుగా చూసింది నావైపు. "ఎవర్నైనా తెచ్చుకోలేక పోయారా?" ఉచిత సలహా ఇచ్చింది.

లోపల్నుంచి కోపం తన్నుకొస్తోంది. అసలు ఈవి డెవరో తెలీదు. ఎంతసేపూ నా వివరాలు అడుగుతోందేకాని, తనగురించి చెప్పదు. పోనీ డైరెక్టుగా అడిగేద్దామా అంటే ఓసారి అలా అడిగి భంగపడిన సంఘటన

జరిగింది.

***

ఆ రోజు బస్సుకోసం నిల్చున్నాను. అసలే ఆఫీసుకి లేటైపోతోంది. కనుచూపు మేరలో ఎక్కడా బస్సొచ్చే సూచనలు లేవు. కంగారుగా నిల్చుంటే పక్కనున్నామె పలకరించింది. ఎవరి పెళ్లిలోనో అయిదు నిమిషాలు చూసిన నేను ఆమెను గుర్తు పట్టలేదు. ఆవిడమాత్రం బాగానే గుర్తు పట్టింది. ఆవిడ అడుగుతున్న ప్రశ్నలకి సమాధానం చెప్తుంటేనే నే నెక్కాల్సిన బస్సు వచ్చేసింది. ఇక ఆ తర్వాత ఆవిడ మా బంధు వర్గాని కంతా నే నెంత గర్విష్టినో, ఎదుటివారిని గుర్తు పట్టలేనట్లుగా ఎలా ప్రవర్తించానో చిలవలు పలవలు కల్పించేసింది. అందుకే అప్పటినుంచి ఎవరు పలకరించినా, తెలిసున్న వాళ్లలాగే పలక రించడం మొదలెట్టాను. కాని, మరీ ఇంత జిడ్డులా పట్టుకుని ప్రశ్న లేసినవాళ్లు ఎక్కడా తారస పడలేదు, ఈవిడతప్ప. నేనేం సమాధానం చెప్పక పోయేసరికి ఇంకా నా మొహంలోకే చూస్తోంది. సరేలే, ఈ సమాధానం చెప్తేనైనా వదులుతుందేమమో అనుకున్నా.

"నా కలాంటి ఉద్దేశం లేదండీ. మా సంపాదన అనుభవించే యోగం ఉంటే వాళ్లే పుట్టుకొస్తారు" అన్నాను.

అంత బస్సు రొదలోకూడా మా సంభాషణ కొంతమంది ఆసక్తిగా చెవులు రిక్కించి మరీ వినడం కనిపించింది. ఆవిడ, ఆవిడ ప్రశ్నలతీరు చూస్తూంటే మహా మంటగా ఉంది. కిటికీపక్క సీట్లో జారగిలబడి రాణీగారిలా ఆవిడ కూర్చుంటే, చెమటలు కార్చుకుంటూ నిలబడ్డాను నేను. కనీసం కాస్త సర్దుకుని జాగా ఇద్దామన్న జ్ఞానం లేదు. ఆవిడ ఒక దానివెంట మరొకటి ప్రశ్నలు సంధించడం, కోర్టులో ముద్దాయిలా నేను సమాధానా లివ్వడం....నే నింకా ముప్పై కిలోమీటర్లు ప్రయాణం చెయ్యాలి. ఈ మహాతల్లి ఇంకెక్కడ దిగుతుందో తెలీదు. ఈలోగా నా మెదడు పీచుమిఠాయిలా కొరుక్కు తినేసేలా ఉంది.

"ఆమధ్య మీ బంధువు లమ్మాయి ఇంటర్ కాస్ట్ మారేజ్ చేసుకుందికదా....ఇప్పటికింకా వాళ్లిద్దరూ కలిసే ఉంటున్నారా?!" మరోబాణం.

"అబ్బే....అసలు మా బంధువుల్లో ఎవరూ అలాంటి పెళ్లి చేసుకోలేదండీ...అందరూ సాంప్రదాయంగా చేసుకున్నవాళ్లే." కోపంగా, చిరాగ్గా చెప్పాను.

నా మాటేం ఆవిడ పట్టించుకున్నట్లు లేదు. "పోన్లెండి...ఇవాళ, రేపు ఇదొక ఫాషన్ అయి పోయింది. ఈ దిక్కుమాలిన టీనేజ్ లవ్ స్టోరీ, సినిమాలు చూసి నేర్చుకున్నదంతా" అంది.

మా బంధువు లమ్మాయి లెవరూ నిజంగా అలాంటి పెళ్లి చేసుకోలేదు. ఎంత మొత్తుకున్నా నమ్మేట్లు లేదు.

"ఆ రాజంపేటలో ఇల్లమ్మేశారా?" అడిగిం దావిడ.

"ఏ రాజంపేట...ఇల్లమ్మట మేమిటి?!"

"అదే...అక్కడ ఉమ్మడిగా మీ నాన్నగార్కి, బాబాయిలకు ఉన్న ఇల్లు...ఆ ఇల్లు గురించే చాన్నాళ్లు గొడవ పడింది."

"ఆ గొడవలు గురించి మీకు కచ్చితంగా తెలుసా?" అడిగాను.

"ఆ....చాలావరకు తెలుసు." అంది.

హమ్మయ్య....నెత్తిమీంచి వెయ్యి టన్నుల బరువు తగ్గినట్లయింది. జీవితంలో ఇంత రిలీఫ్ ఎన్నడూ పొందలేదు. మొహమాటానికి ఈవిడ వేసే అడ్డమైన ప్రశ్నలకి సమాధానం చెప్పే పనిలేదని తెలిపోయింది. ఎందుకంటారా...ఆ రాజంపేట ఎక్కడుందో తెలీదు. నేను పుట్టింది, పెరిగింది విశాఖలోనే. మా నాన్నగారు, చిన్నాన్నలు ఉద్యోగా లొచ్చాక ఎవ రిల్లు వాళ్లు సొంతంగా కట్టుకున్నారుమరి.

అందుకే అంత రిలీఫ్.

•


